# హృదయఘోష




కళ్లుమూసుకుని తులసికోట చుట్టూ తిరుగుతున్నామెను ఓ రెండు నిమిషాలపాటు చూసారు ఆ దంపతులు. తామొచ్చినట్టు తెలియాలని పొరపోయినట్టు దగ్గడంతో 'శాంతి' కళ్లు తెరిచింది.

'శాంతమ్మా... ఇంకా ఈ తులశమ్మ పూజ

నొదల్లేదా? ఎందుకమ్మా యివన్నీ... అయిదో తనం నిలవడానికే యియ్యన్నీ అని మా ఊళ్లో బాపనమ్మోరంటది...' నసిగింది లక్ష్మమ్మ.

'మనసుని కుదట పరిచేవాటిలో పూజొకటి. పూజ వల్ల యిబ్బందేంది?'

'అదికాదమ్మా... పూజలన్నీ ఎట్టున్నా... తులశమ్మ పూజ్జేస్తుంటే...' సందేహంగా అంది.

'నీ ఉద్దేశంలో కేవలం భర్త బాగోగుల కోస మే తులశమ్మను కొలవడం... సరే... అయితే ఆమెను స్మరించడం వల్ల ఏమౌతుంది? అల వాటు మానుకోలేక...'

'అట్టా గాదులేమ్మా... ఇది మరీనూ... తన కే అన్నీ తెలుసనుకొంటది. అందువల్లే ఏదంటే అది మాటాడుద్దిలే... మీలాంటోళ్లు ఈ పూజ్జే యడం సూళ్లేదేమో... అయినా దానికేం తెలీదు లేమ్మా...'

ఇంతకూ మనం వొచ్చిన పని... సెప్పే...

వెంకటేశ మాటల్నందుకొంది లక్ష్మమ్మ 'ఆ... ఔనౌను... మా మధుగాడికి పెళ్లికుదిరింద మ్మా... నీ పుణ్ణేనే ఆడు సదూకొని యింతటో డైండు...'

'సదూసెప్పే అమ్మోర్లు, అయ్యోర్లు ఎంతో మంది వున్నా తమరిలాగ పిలకాయల్ని వురిది లోకి తెచ్చేవాళ్లున్నారా... పిల్లల్ని దగ్గరెట్టుకొని సదూ సెప్పడమే గాకుండా, డబ్బు సాయం జేత్తాండబట్టే... ఈ రోజు యింత హెూదాలోకి వచ్చినానని మావోడు మాకెన్నోసార్లు సెప్పిం డు... వాడెంతగా తమర్ని తల్సుకొంటుంటా డో...'

'దాందేముందిలే వెంకటేశూ... ఏ గురువు కైనా శిష్యుడు తెలివిగలవాడనితోస్తే సాయం చెయ్యకుండా వుండలేడు... తప్పకుండా చె య్యందిస్తాడు.

గురువుకి ఓ గొప్ప అర్థం వుంది. నేనే ఏదో ఎంతో చేశానని అమితంగా పొగుడుతున్నారు. లోపలికెల్లి కూచుందాం రండి. తన నీడ తన తోనే వున్నట్టు, తన తెలివే అతన్నింతవాణ్ని జేసింది' అంటూ లోపలికి దారి తీసింది.

'అదిసరేగాని టీచరమ్మా... చెట్టుంటేనే గదా నీడపడేది... యామైనా మావోడి బతుక్కి యెల్తురు ఎవురోగాదు... తమరే...'.

'ముందుగా పెళ్లికార్డు నీకే యియ్యమని పక్కింటి రామయ్యింటికి ఫోన్ చేసి సెప్పిండు... పన్లు జూస్కుని వచ్చేసరికి వారం దాటింది. మా ఊరి దేవళం పూజారికి ముందుగా యి చ్చిండు'.

'ఎప్పుడిస్తే ఏముందిలే లక్ష్మమ్మా... వాడికి నేనంటే గొప్ప... అందుకే అట్లా ఫోన్ చేసుం టాళ్లే...' నవ్వుతూ అంది శాంతి.


రెండుప్లేట్లలో బిస్కెట్లు పెట్టి అందించింది వెంకటేశు లక్ష్మమ్మలకు.

'మంచి ఉద్యోగానికి తోడు పెళ్లి చేస్కుంటే సంతోషం. అన్ని వివరాలూ మధు వచ్చాక తెలు స్తాయిలే...' కాఫీ తెస్తానంటూ లోపలికెల్లింది.

వెంకటేశు, లక్ష్మమ్మ యిద్దరూ వొకరి ముఖా లొకరు చూస్కున్నారు. 'ఏమయ్యో... వాడు రావడం నేరుగా ఈయమ్మ దగ్గరికే వస్తడేమో... రూపాయి బిళ్లేసి మాట్లాడాలే... అట్టాగాకుండా మనింటికే ముందు రమ్మందాం...' గుసగుసలు పోయింది.

'ఆ... అట్టాగేలేయే... అంతేలే...' వెంకటే శు సరిపెట్టాడు తలూపుతూ'.

తులసికోట దగ్గరున్న కొబ్బరిచిప్ప తెచ్చి యివ్వబోయింది శాంతి వాళ్లకి కాఫీ యిచ్చాక. 'వొద్దులేమ్మా... పిలకాయలికి ఎవురికైనా పెట్ట మ్మా... ఈ పత్తిరికలిచ్చుకుంటూ ఊరెప్పుడు




సేరుతామో ఏమో...!

'వొచ్చిన పనయ్యాక యింకో సోటికి పోవాల...' అంటూ వెంకటేశు సంచిలోంచి పెళ్లి పత్రిక తీసివ్వబోతుంటే, అందుకోవడానికి చెయ్యిచాపింది శాంతి.

చేతికివ్వకుండా పక్కనున్న స్టూలుమీద పెట్టాడు వెంకటేశు. అప్పుడే కుంకుమ భరిణె లోంచి కుంకుమతీసి తలుపుకి పెట్టింది లక్ష్మమ్మ.

క్షణంసేపు 'శాంతి' కళ్లు గుండెల్ని గుద్దాయి.

తిరిగి చూడకుండా వెళ్లారిద్దరూ.

'ఎంతగా మనోడికి మఖ్యమైతే మాత్రం... వోడు సెప్పినట్టే ఎట్టిస్తాం పత్తిరిక. సదుకొన్నా మేగానీ ఏమీ తెలిసినట్టులేదు. తులిశమ్మోరికి పూజ్జెయ్యడం... పత్తిరిక్కి సెయ్యి సాపడం ఏంది?!

వెళ్తూ వెళ్తూ యెంకటేశుతో లక్ష్మమ్మ అనే మాటలు వీధి కిటికీని అప్పుడే తెరిచిన 'శాంతి' చెవినపడ్డాయి.

నవ్వాలో... ఏడ్వాలో... ఎదిరించి మాట్లాడాలో తెలియని పరిస్థితులుంటాయి కొన్ని. అటువంటి పరిస్థితే ఎదురై బిత్తరపోయింది శాంతి.

వెళ్తూన్న వారివైపు ఓ ఐదు నిమిషాలు అచేతనంగా చూస్తూండిపోయింది.

ఏటి గట్టు నుండి ఏట్లోకి తోసేసినట్టనిపించింది శాంతికి.

ఆకాశంలో నీలి మబ్బులు నిండినప్పుడు వొక్కోసారి నీళ్లు కురుస్తాయి... వొక్కోసారి నిప్పులూ కురుస్తాయి... మరోసారి ఏదీ లేకుండా తేలిపోతాయి.

పంట పండాలన్నా... ప్రాణం నిలబడాలన్నా నీళ్లు కావాలి... కానీ వొక్కోసారి నీళ్లు ప్రాణాల్ని కూడా తీస్తాయి...

ఆ గజిబిజి ఆలోచనల్తో ఆ హృదయఘోష అనంతం...?